సాక్షి ప్రకాశం

ఆదివారం । 28 । జనవరి । 2024



వికసించిన గ్రామ స్వరాజ్యం

గ్రామ స్వరాజ్యం సాకారమయ్యేలా ఇంటిగ్రేటెడ్ సచివాలయ సముదాయాలు నిలుస్తున్నాయి. టంగుటూరులో నిర్మించిన ఈ సముదాయం ఆకట్టుకుంటోంది. - 8లో..



రఘునాయక స్వామి ఆలయంలో చోరీ

ప్రసిద్ధ చారిత్రాత్మక ఆలయం చదలవాడలోని రఘునాయకస్వామి ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. పది కేజీల వెండిని అపహరించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
34/22

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

గ్రూప్-2కు ఉచిత శిక్షణ

ఒంగోలు సెంట్రల్: ఏపీ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఏపీపీఎస్సీ గ్రూప్-2కు ఒంగోలులో ఈనెల 28 నుంచి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ అధికారి, స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఎం.అంజల తెలిపారు. అనువజ్ఞులైన అధ్యాపకులచే ఉచిత శిక్షణ ఇస్తారని, శిక్షణతో పాటు ప్రతి రోజు సబ్జెక్టుకు సంబంధించిన ప్రాక్టీస్, గ్రాండ్ టెస్ట్‌లు నిర్వహిస్తారని చెప్పారు. లైబ్రరీలో స్టడీ మెటీరియల్ కూడా అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. స్టయిఫండ్, స్టడీ మెటీరియల్ కూడా ఇవ్వనున్నట్లు చెప్పారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అభ్యర్థులు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న గవర్నమెంటు ఆఫీస్ కాంప్లెక్స్‌లో సంప్రదించాలన్నారు. పూర్తి వివరాలకు కార్యాలయం ఫోన్ నంబర్ 08592-231232, 9989285530, 8985090926లను సంప్రదించాలని కోరారు.

ఉత్తమ పురస్కారం అందుకున్న దూపాడు పంచాయతీ



మెమొంటో అందుకుంటున్న దూపాడు సర్పంచ్, పీఎస్


త్రిపురాంతకం: గణతంత్ర దినోత్సవాలను పురస్కరించుకుని న్యూఢిల్లీలో కేంద్ర పంచాయతీ రాజ్ శాఖచే దూపాడు గ్రామపంచాయతీ ఉత్తమ పురస్కారాన్ని అందుకుంది. త్రిపురాంతకం మండలం దూపాడు గ్రామపంచాయతీ సర్పంచ్ ఎనిబెర శైలజ, పంచాయతీ కార్యదర్శి వై శ్రీనివాసరావు గణతంత్ర దినోత్సవంలో పాల్గొన్నారు. 24వ జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఉత్తమ గ్రామపంచాయతీగా ఎంపికైంది. ఈసందర్భంగా గణతంత్ర దిన వేడుకలకు ఆహ్వానం అందడంతో గ్రామ పంచాయతీ నుంచి పరేడ్‌లో పాల్గొన్నారు. ఈసందర్భంగా కేంద్ర పంచాయతీరాజ్ కార్యదర్శి విద్యాకౌశిక్ గ్రామసర్పంచ్ శైలజ, పీఎస్ శ్రీనివాసరావులకు మెమొంటో అందజేసి సత్కరించారు. వీరిని ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, ఎంపీడీ సాంబశివరావు, తహసీల్దార్ వీ కిరణ్ అభినందించారు.

జగనన్న కాలనీల్లో

ధగ ధగలు..

జగనన్న కాలనీలతో గ్రామాలు, పట్టణాలు సరికొత్త శోభను సంతరించుకుంటున్నాయి. కొత్తగా నిర్మితమవుతున్న కాలనీలు ఊళ్లుగా మారుతున్నాయి. పేదల సొంతింటి కల సాకారం చేయడమే కాదు..ఇళ్ల నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి. ప్రభుత్వ సాయం..అధికారుల ప్రోత్సాహంతో నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. రోడ్లు, నీరు, విద్యుత్ సౌకర్యాలను కల్పిస్తోంది. దాదాపు 80 శాతం పైగా కాలనీల్లో విద్యుదీకరణ పనులు పూర్తయ్యాయి. దీంతో ఆ ఆనందాల లోగిళ్లు దేదీప్యమానంగా వెలిగిపోతున్నాయి.

- జిల్లాలో 643 జగనన్న కాలనీలు
- 522 కాలనీల్లో విద్యుదీకరణ పూర్తి
- 5099 ఇళ్లకు విద్యుత్ సరఫరా
- విద్యుత్ సౌకర్యం కోసం రూ.90 కోట్లు ఖర్చు



ఇడుపూరు లేఅవుట్‌లో విద్యుత్ కాంతుల వెలుగులు



ఇడుపూరు వద్ద నిర్మాణంలో ఉన్న ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్

మార్కాపురం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ప్రతి పేదవానికి సొంత ఇంటి కల సాకారం చేసేలా స్థలాలు ఇవ్వడంతో పాటు, ఇళ్లు కట్టించి ఇస్తోంది. ప్రతి గ్రామం దగ్గర నూతనంగా జగనన్న కాలనీ ఏర్పాటవుతోంది. రోడ్లు, విద్యుత్ సౌకర్యం, తాగు నీటి సరఫరా ఒకటేమిటి అన్నీ హంగులు, సౌకర్యాలతో జగనన్న కాలనీలు పూర్తికావస్తున్నాయి. పేద ప్రజలందరూ తమ ఇళ్లను చూసుకుని గుండెనిండా సంతోషంతో పొంగిపోతున్నారు. జిల్లాలో మొత్తం 643 జగనన్న కాలనీలు ఏర్పాటుకాగా, ఇప్పటి వరకూ 522 కాలనీల్లో విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్ సౌకర్యం కల్పించారు. మొత్తం 7960 ఇళ్ల నిర్మాణాల్లో 5099 ఇళ్లకు విద్యుత్ సరఫరాతో పాటు మీటర్లు కూడా బిగించారు. ఇందుకోసం విద్యుత్ శాఖాధికారులు రూ.90 కోట్లు ఖర్చుపెట్టారు. చకచకా కాలనీల్లో విద్యుదీకరణ పనులు పూర్తి కావస్తున్నాయి. ఫిబ్రవరి నెలాఖరులో అన్నీ కాలనీల్లో విద్యుత్ సౌకర్యం కల్పించనున్నారు.

పశ్చిమ ప్రకాశంలో ఇలా..

పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల్లో మొత్తం 220 లేఅవుట్లు ఉన్నాయి. విద్యుత్‌శాఖ పరంగా మార్కాపురం, కంభం, గిద్దలూరు, యర్రగొండపాలెం సబ్ డివిజన్లు ఉన్నాయి. మార్కాపురంలో మొత్తం 66, కంభంలో 57, గిద్దలూరు 69, వైపాలెం 28 లేఅవుట్లు ఉన్నాయి. వీటిలో చాలా వరకూ విద్యుదీకరణ పూర్తయింది.

మొత్తం 4877 విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. మార్కాపురం మండలం ఇడుపూరు వద్ద ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మిస్తున్నారు. జగనన్న కాలనీల్లో మొత్తం 75 కి.మీ పొడవునా విద్యుత్‌లైన్లు ఏర్పాటు చేశారు. సొంత స్థలాల్లో ఇల్లు కట్టుకున్న 2177 మంది లబ్ధిదారుల గృహాలకు విద్యుత్ సౌకర్యం కల్పించారు. వివిధ కాలనీల్లో సబ్‌స్టేషన్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. దీంతో రాత్రిపూట జగనన్న కాలనీల్లోకి వెళితే కొత్త గ్రామాలకు వెళ్లినట్లు అనిపిస్తోంది. వేల సంఖ్యలో వీధి దీపాలు కూడా ఏర్పాటు చేయడంతో రాత్రిపూట విద్యుత్ కాంతుల వెలుగుల్లో కాలనీలన్నీ జిగేల్‌మంటున్నాయి. దీంతో లబ్ధిదారులు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు. జగనన్న కాలనీల్లో విద్యుత్ కనెక్షన్ల ఏర్పాటుకు విద్యుత్ శాఖాధికారులు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు. వ్యక్తిగతంగా కట్టుకునే ఇంటి నిర్మాణాలకు కూడా అడిగిన వెంటనే విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నారు.

ఫిబ్రవరి నెలాఖరుకు విద్యుదీకరణ పూర్తి



ఫిబ్రవరి నెలాఖరుకు జిల్లాలోని 643 జగనన్న కాలనీల్లో విద్యుదీకరణ పూర్తి చేస్తాం. ఇప్పటికే 5099 ఇళ్లకు విద్యుత్ సరఫరా ఇవ్వడంతోపాటు మీటరు కూడా ఏర్పాటు చేశాం. దాదాపు రూ.90 కోట్ల ఖర్చుతో వీటిని ఏర్పాటు చేశాం. లబ్ధిదారులు కూడా త్వరగా కట్టుకుంటే విద్యుత్ కనెక్షన్లు ఇస్తాం. – కె.వి.సత్యనారాయణ, విద్యుత్ ఎస్ఈ, ఒంగోలు

త్వరలో అన్నీ కాలనీలకు విద్యుత్



జగనన్న కాలనీల్లో యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నాం. మా సిబ్బంది గృహ నిర్మాణశాఖ ద్వారా మంజూరైన ఇళ్లకు కూడా వెంటనే కనెక్షన్లు ఇస్తున్నారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. పలు కాలనీల్లో సబ్‌స్టేషన్ల నిర్మాణాలు కూడా వేగంగా సాగుతున్నాయి. నీటికి ఇబ్బంది రాకుండా విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నాం. – షియానాయక్, డీఈ, మార్కాపురం

ఒంగోలులో ఇళ్ల స్థలాల పనులకు రైతులతో చర్చలు

- సోమవారం నుంచి రైతుల ఖాతాల్లోకి నగదు జమ
- కార్యరూపం దాలుస్తున్న ఎమ్మెల్యే బాలినేని కృషి



రైతులతో సమావేశమైన ఆర్‌డీఓ, తహసీల్దార్లు

ఒంగోలు అర్బన్: ఒంగోలులో పేదలకు నివాస స్థలాల మంజూరు విషయమై ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి చేస్తున్న కృషి వేగవంతంగా కార్యరూపం దాల్చుతోంది. ఇప్పటికే అందుకు సంబంధించిన నగదు రూ.202.03 కోట్లు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేయగా కలెక్టర్ ఖాతాకు చేరింది. నివాస స్థలాలకు అవసరమైన భూమి వెంగముక్కపాలెం, యరజర్ల గ్రామాల్లో సుమారు 175 ఎకరాలకు చెందిన యజమానులు 90 మంది రైతులతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. శనివారం జిల్లా రెవెన్యూ అధికారులు నివాస స్థలాల కోసం భూములు ఇచ్చిన వెంగముక్కపాలెం, యరజర్లలో రైతులతో చర్చలు జరిపారు. ఆర్‌డీఓ విశ్వేశ్వర రావు, తహసీల్దార్ మురళి రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఒప్పదం ప్రకారం కుదుర్చుకున్న మొత్తం నగదును సోమవారం నుంచి సంబంధిత రైతుల ఖాతాల్లోనికి నగదు జమ చేస్తారని చెప్పారు. అయితే ఈలోపు రెవిన్యూ అధికారులు నివాస స్థలాల ఏర్పాటుకు సంబంధించిన ప్రాథమిక పనులు చేసేందుకు రెవెన్యూ సిబ్బందిని రైతులు అనుమతించాలని కోరారు. అందుకు రైతాంగం కూడా అంగీకారం తెలిపటంతో నివాస స్థలాల పనులు ఊపందుకోనున్నాయి. వీఆర్‌ఓ శ్రీనివాస రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

'సూర్యయజ్ఞం' విజయవంతం చేయాలి



సూర్య యజ్ఞ యోగాసనాల నిర్వహణపై సమీక్షిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

- సూర్య నమస్కారాల వల్ల ఆరోగ్య ప్రయోజనాలపై అవగాహన కల్పించాలి
- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఫిబ్రవరి 15వ తేదీ రథసప్తమి సందర్భంగా నిర్వహించే సూర్యయజ్ఞం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. ప్రకాశం భవనంలో సూర్య యజ్ఞ కార్యక్రమం ఏర్పాటుపై శనివారం సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ సూర్య నమస్కారాల వలన కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు, భారత్ వరల్డ్ రికార్డు నమోదులో భాగంగా నగరంలో సుమారు 3 వేల మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో రథ సప్తమి రోజున సూర్య యజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒంగోలు, కొత్తపట్నం, మద్దిపాడు, సంతనూతలపాడు మండలాలకు సంబంధించి 35 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన మూడు వేలమంది విద్యార్థులతో పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ఈ కార్యక్రమం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పాల్గొనే విద్యార్థుల నమోదు ప్రక్రియను ఫిబ్రవరి 5వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. కార్యక్రమం జరిగే రోజు మెడికల్ క్యాంపు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. న్యాయ నిర్ణేతలుగా ఆయుష్ శాఖ అధికారులు, జాతీయ స్థాయి యోగా ప్రముఖులను ఆహ్వానించాలన్నారు. కార్యక్రమం మొత్తం వీడియో రికార్డింగ్ చేయాలన్నారు. సమావేశంలో డీఈఓ సుబ్బారావు, డీటీసీ సుశీల, ట్రాఫిక్ డీఎస్‌పీ విక్రమ శ్రీనివాస్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి వనజ, పతంజలి శ్రీనివాస్, పీఈటీలు పాల్గొన్నారు.

29 నుంచి బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ

- 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి విద్యుత్ టారిఫ్ నిర్ణయం కోసం
- నాలుగు రోజుల పాటు నిర్వహణ
- ఉమ్మడి ప్రకాశం జిల్లా ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ కేవీజీ.సత్యనారాయణ



కేవీజీ.సత్యనారాయణ, ఎస్ఈ

ఒంగోలు సబర్బన్: ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని విద్యుత్ వినియోగదారుల కోసం ఈ నెల 29వ తేదీ నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఏపీసీపీడీసీఎల్ జిల్లా ఎస్ఈ కేవీజీ.సత్యనారాయణ చెప్పారు. ఈ మేరకు ఆయన స్థానిక రామ్ నగర్‌లోని విద్యుత్ భవన్‌లో శనివారం సాయంత్రం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ రెగ్యులేటరీ కమిషన్ (ఏపీఈఆర్‌సీ) ఆధ్వర్యంలో 2024-25 సంవత్సరానికి సంబంధించిన విద్యుత్ టారిఫ్‌లపై ప్రతి జిల్లాలో బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. అందుకుగాను ఆ నాలుగు రోజుల పాటు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఆయా కార్యాలయాల్లో బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణకు అవకాశం కల్పించారన్నారు. ముందుగా విద్యుత్ వినియోగదారులు తమ అభ్యంతరాలను, సమస్యలను ఆన్‌లైన్‌లో ఏపీఈఆర్‌సీ వెబ్‌సైట్, ఏపీసీపీడీసీఎల్ వెబ్‌సైట్లలో అభ్యంతరాలు తెలియజేయాలనుకునే వారు వారి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. అందులో భాగంగా ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లో దాదాపు జిల్లా వ్యాప్తంగా 83 మంది విద్యుత్ వినియోగదారులు తమ అభ్యంతరాలను తెలియజేశారని పేర్కొన్నారు. ఇంకా ఈ నెల 28వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో అభ్యంతరాలను తెలియజేయటానికి అవకాశం ఉందని, వెంటనే విద్యుత్ వినియోగదారులు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. అందుకుగాను ఈ నెల 29వ తేదీ నుంచి జిల్లా కేంద్రంలోని ఒంగోలు నగరంలోని రామ్ నగర్‌లో ఉన్న విద్యుత్ భవన్‌లో నిర్వహించే బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి వచ్చి తమ అభ్యంతరాలను వెలిబుచ్చవచ్చన్నారు. ఈఈ కార్యాలయాల్లో కూడా బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ కోసం ఏర్పాట్లు చేశామన్నారు. ప్రధానంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి డిస్కం ప్రతిపాదించిన వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై తమ అభిప్రాయాలను తెలియజేయవచ్చన్నారు. ఏపీఈఆర్‌సి రెగ్యులేషన్ కమిషన్ ప్రకారం ప్రతి సంవత్సరం ప్రభుత్వ యాజమాన్యంలోని డిస్ట్రిబ్యూషన్ లైసెన్స్ కలిగిన విద్యుత్ పంపిణీ సంస్థలు ఏపీఈఆర్‌సీకి రానున్న ఆర్థిక సంవత్సరానికి అవసరమైన టారిఫ్ ప్రతిపాదనలను ఈపీఈఆర్‌సీకి సమర్పిస్తారన్నారు.

రైల్వే ఓవర్ బ్రిడ్జికి భూ సర్వే

ఒంగోలు: గిద్దలూరులో గతిశక్తి పథకం కింద రాచర్ల రైల్వే గేటు వద్ద నిర్మించతలపెట్టిన రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన భూ సర్వే పనులను గతిశక్తి రైల్వే అధికారులు చేపట్టారు. దీని నిర్మాణమై ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఇటీవల రైల్వే బోర్డు చైర్మన్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. దీనిపై గుంటూరులోని దక్షిణ మధ్య రైల్వే గతిశక్తి డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ రాచర్ల రైల్వే గేటు వద్ద టీ టైపు రైల్వే ఓవర్ బ్రిడ్జి, సర్వీసు రోడ్లు గతిశక్తి పథకం కింద నిర్మించేందుకు నిర్ణయించినట్లు ఎంపీకి వివరించారు. దాని డిజైన్ కూడా తయారుచేయించామని పేర్కొన్నారు. రైల్వే బోర్డు అనుమతి పొందేందుకు రైల్వే గేటుకు ఇరువైపులా అవసరమైన భూసేకరణ తదితర పనులకు సంబంధించి అంచనాలు పంపాల్సిందిగా కలెక్టర్‌ను కోరినట్లు పేర్కొన్నారు. టీ టైపు రైల్వే ఓవర్‌బ్రిడ్జి త్వరితగతిన నిర్మించేందుకు గిద్దలూరు మున్సిపల్, రెవెన్యూ, రోడ్లు భవనాల శాఖ అధికారులు, ప్రజలు సహకరించాలని ఎంపీ మాగుంట శనివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

జగన్ మళ్లీ సీఎం అయితేనే సంక్షేమ పథకాలు

- సీఎం చేతుల మీదుగా త్వరలో ఒంగోలులో ఇంటి పట్టాలు
- నావల్ల మేలు జరిగితేనే ఓటేయండి అని చెప్పే దమ్మున్న నాయకుడు వైఎస్ జగన్
- రూ.3 కోట్లతో నిర్మించిన మున్సిపల్ కార్యాలయం నూతన భవనాన్ని ప్రారంభించిన బాలినేని, మంత్రి మేరుగు, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి



మంత్రి మేరుగు నాగార్జునను స్థానికులకు పరిచయం చేస్తూ మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

చీమకుర్తి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్లుగా నిరంతరం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ముఖ్యమంత్రిగా ఆయన్ను మళ్లీ గెలిపించుకోవాలని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం చీమకుర్తి మున్సిపల్ కార్యాలయం నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి బాలినేనితో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి, సంతనూతలపాడు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మేరుగు నాగార్జున, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు చంద్రబాబు డ్వాక్రా మహిళలకు రుణ మాఫీ చేస్తానని చేయలేదని.. పసుపు కుంకుమ పేరుతో చేతులు దులుపుకున్నాడన్నారు. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు డ్వాక్రా మహిళల రుణాలను నాలుగు విడతలుగా చెల్లిస్తానని ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాడని చెప్పారు. ఒంగోలులో పేదల ఇళ్ల స్థలాలకు డబ్బులిస్తేనే పోటీచేస్తానని చెప్పానని, చెప్పిన ప్రకారమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఇళ్ల స్థలాల కోసం రూ.210 కోట్లు మంజూరు చేశాడని గుర్తు చేశాడు. త్వరలో సీఎం చేతుల మీదుగా ఒంగోలులోని 25 వేల మంది పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేస్తామని చెప్పారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మంత్రి మేరుగు నాగార్జునను అత్యధిక మెజారిటీతో సంతనూతలపాడు ఎమ్మెల్యేగా గెలిపించాలని స్థానిక ప్రజలకు బాలినేని విజ్ఞప్తి చేశారు.

మేలు జరిగితేనే ఓటేయండని చెప్పే దమ్మున్న నాయకుడు జగన్:

మీకు మేలు జరిగితేనే నాకు ఓటేయండి అని చెప్పే దమ్మున్న నాయకుడు మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. సంక్షేమ పథకాల వలన లబ్ధిపొందని కుటుంబం లేదని అన్నారు. జగన్ అవసరం ప్రజలకు ఎంతో ఉందని.. ఆయనను మళ్లీ సీఎంగా గెలిపించుకుంటేనే ఇప్పుడొస్తున్న సంక్షేమ పథకాలు మళ్లీ అందుతాయని తెలిపారు.

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ సంతనూతలపాడు నియోజకవర్గంలో మళ్లీ వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేయాలని, మేరుగు నాగార్జునను గెలిపించి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ సీఎం చేసుకుందామని పిలుపునిచ్చారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 12 అసెంబ్లీ స్థానాలను వైఎస్సార్ సీపీ గెలుచుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే, దర్శి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ నూటికి నూరు శాతం హామీలు నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. జిల్లాలో మళ్లీ వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడాలని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేసుకునే వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. తొలుత రూ.3 కోట్లతో నిర్మించిన మున్సిపల్ కార్యాలయం నూతన భవనాన్ని బాలినేని, మేరుగు నాగార్జున, బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం డ్వాక్రా మహిళలకు రూ.14.57 కోట్ల విలువ చేసే వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కును అందించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. తొలుత డ్వాక్రా మహిళలతో కలిసి జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ కోలాటం ఆడటం ఆకట్టుకుంది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి పూర్ణచంద్ర, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, చీమకుర్తి పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, రూరల్ కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, సంతనూతలపాడు, మద్దిపాడు, నాగులుప్పలపాడు మండలాల కన్వీనర్‌లు దుంపా చెంచిరెడ్డి, మండవ అప్పారావు, పోలవరపు శ్రీమన్నారాయణ, సంతనూతలపాడు జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, నలమలపు కృష్ణారెడ్డి, చీమకుర్తి మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బాపతు వెంకటరెడ్డి, ఎస్.మాణిక్యం, డాక్టర్ బి.జవహర్, చలువాది బదరీనారాయణ, గోగినేని వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు, సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, పలు విభాగాలకు చెందిన పార్టీ నాయకులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని, మంత్రి మేరుగు, జెడ్పీచైర్‌పర్సన్ వెంకాయమ్మ, దర్శి ఇన్‌చార్జి శివప్రసాదరెడ్డి



డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా నాలుగవ విడత రూ.14.57 కోట్ల చెక్కును అందిస్తున్న బాలినేని, మేరుగు, బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి


అనంతవరం ఇంటిగ్రేటెడ్ సచివాలయ సముదాయం ఇలా..


రైతు భరోసా కేంద్రం


వైఎస్సార్ విలేజ్ క్లినిక్

వికసించిన గ్రామ స్వరాజ్యం

- అన్ని రకాల ప్రభుత్వ సేవలు ఒకేచోట
- అందంగా రూపుదిద్దుకున్న అనంతవరం ఇంటిగ్రేటెడ్ సచివాలయ సముదాయం
- జిల్లా లోనే మొట్ట మొదటిదిగా రికార్డు
- సర్పంచ్‌కు కలెక్టర్ అభినందనలు
- స్థలదాత ఏవీఎస్ రాజు


సచివాలయం సముదాయంలో ఉన్న రోడ్లు


జగనన్న పాల వెల్లువ మహిళా డెయిరీ


సచివాలయం

టంగుటూరు: జాతిపిత మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సాకారం చేస్తున్నారు. దీనిలో భాగంగా అనంతవరం గ్రామంలో నిర్మితమైన ఇంటిగ్రేటెడ్ సచివాలయ సముదాయం వన్నె తెస్తోంది. ఈ గ్రామానికి చెందిన దివంగత ఆల్లూరి బసవరాజు జ్ఞాపకార్థం కుమారుడు ఏవీఎస్ రాజు ఇంటిగ్రేడ్ సచివాలయ సముదాయం నిర్మాణానికి 1.08 సెంట్ల స్థలాన్ని దానం చేశారు. దీనిలో భాగంగా ప్రభుత్వ సచివాలయం రూ. 42.50 లక్షలు, రైతు భరోసా కేంద్రం రూ. 20 లక్షలు, వైఎస్సార్ విలేజ్ క్లినిక్ రూ. 20, జగనన్న పాల వెల్లువ డెయిరీ రూ. 15.60 లక్షలతో వాటి నిర్మాణాలు తీర్చిదిద్దారు. అలాగే అంతర్గత రోడ్లు, గ్రార్డెన్, ప్రహరీ కోసం రూ. 40 లక్షలను గ్రామానికి చెందిన ఏవీఎస్ రాజు సమకూర్చడం విశేషం. ఈ సముదాయాన్ని సుందరంగా నిర్మించినందుకు గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఒంగోలు పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో అనంతవరం సర్పంచ్ ఉప్పలపాటి శివరాయరాజుని కలెక్టర్ దినేష్ కుమార్ శాలువాతో సన్మానించి అభినందించారు.

ఇంటిగ్రేటెడ్ సచివాలయ సముదాయం సేవలు ఇలా ..

సీఎం జగన్ దార్శనికతలో భాగంగా 2000 మంది జనాభాకు 10 మంది ప్రభుత్వ ఉద్యోగులను నియమించి పరిపాలనలో అవినీతి, వివక్షకు తావులేకుండా చేయడానికి సచివాలయాలు రూపుదిద్దుకున్నాయి. ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను నియమించి దాదాపు 35 ప్రభుత్వ శాఖలకు సంబంధించి 500 రకాల సేవలు అందుబాటులోకి తీసుకొచ్చారు. అలాగే రైతు భరోసా కేంద్రం ద్వారా ప్రభుత్వం ధ్రువీకరించిన నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అందుబాటులోకి తీసుకొచ్చారు. వ్యవసాయానికి సంబంధించి అత్యుత్తమ విధానాలు, సహజ పద్ధతుల్లో సాగు వంటి వాటిపై రైతులకు శిక్షణ, ఆక్వా ప్రాంత గ్రామాల్లో ఆక్వా రంగానికి సంబధించి వర్కుషాపు కూడా ఉంటుంది. వైఎస్సార్ విలేజ్ క్లినిక్ ద్వారా గ్రామంలోనే ఒక వైద్యాధికారి అక్కడే నివాసం ఉంటూ ప్రజలకు వైద్య సేవలు 24 గంటల పాటు అందిస్తారు. అక్కడే అన్ని పరికరాలు ఉంటాయి. ఏదైనా అత్యవసరమైతే ప్రథమ చికిత్స చేసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తారు. జగనన్న పాల వెల్లువ మహిళా డెయిరీ సహకార సంఘం ద్వారా గ్రామంలోనే పాడి రైతులకు కావాల్సిన అన్ని సదుపాయాలు అందుబాటులో ఉంటాయి. అంటే రైతుకు పాలకు గిట్టు బాటు ధర లభిస్తుంది. మండల కార్యాలయాలు చుట్టూ తిరగకుండా గ్రామంలోనే అన్ని రకాల సేవలు అందుకుంటున్నారు.


సచివాలయం సముదాయంలో ఉన్న గార్డెన్

పథకాలు పక్కాగా అమలు



నవరత్నాలతో పాటు ఇతర పథకాలు క్షేత్ర స్థాయిలో పక్కాగా అమలయ్యేందుకు సచివాలయాలు ఎంతగానో తోడ్పడుతున్నాయి. గ్రామ వలంటీర్ల సహకారంతో సచివాలయాల ద్వారా ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారులకు చేరుతున్నాయి. అమ్మఒడి, రైతు భరోసా, సున్నా వడ్డీ, పింఛన్లు తదితరవి కూడా సచివాలయాల ద్వారా పేదలకు అందుతున్నాయి.

– రత్నజ్యోతి, ఎంపీడీఓ

లబ్ధిదారుల్లో సంతోషం


సర్పంచ్ ఉప్పలపాటి శివరాయరాజుని సన్మానిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్



సచివాలయ సేవలు అందుబాటులోకి వచ్చాక లబ్ధిదారులు ఎంతో సంతోషంగా ఉన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సచివాలయాలు దోహదపడుతున్నాయి. మండల కార్యాలయాలు చుట్టూ తిరిగే పని లేకుండా గ్రామంలోనే అన్ని సమస్యలకు పరిష్కారమవుతున్నాయి. సిబ్బంది సైతం అవినీతికి తావు లేకుండా విధులు నిర్వహిస్తున్నారు.

– సర్పంచ్ ఉప్పలపాటి శివరామరాజు, అనంతవరం

బాలికల చదువుతో భవిష్యత్‌కు భద్రత

- ఇంటర్ బోర్డు సీఓఈ వగ్గంపూడి వెంకట సుబ్బారావు


విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేస్తున్న సీఓఈ వీవీ సుబ్బారావు

మద్దిపాడు: బాలికల చదువు భవిష్యత్ తరాలకు మంచి పునాది ఏర్పరచి, బంగారుబాట వేస్తుందని ఇంటర్ బోర్డు సీఓఈ వగ్గంపూడి వెంకట సుబ్బారావు అన్నారు. శనివారం కళాశాల ప్రిన్సిపాల్ తారక్‌నాథ్ అధ్యక్షతన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 22వ వార్షికోత్సవం జరిగింది. ఆయన మాట్లాడుతూ గత ఏడాది ఇంటర్ ఫైనల్ పరీక్ష ఫలితాల్లో మద్దిపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల జిల్లాలో ద్వితీయ స్థానంలో నిలిచిందని, అందుకు విద్యార్థులు, అధ్యాపకులను ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ ఏడాది మార్చి 1 నుంచి జరగనున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు సిద్ధం కావాలని, బాగా చదివి మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. మద్దిపూడి కళాశాలలో విద్యార్థుల సంఖ్య 100 మందికి దాటితే మద్దిపూడిలోనే పబ్లిక్ పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, కళాశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. ఇంటర్ విద్యార్థి దశ ఎంతో కీలకమైనదని ఇంత మంది బాలికలు గ్రామీణ ప్రాంతంలో చదువుకుంటున్నారంటే మాజీ సర్పంచ్ ఇనుకొల్లు పిచ్చిరెడ్డి రెండు ఎకరాల స్థలం ప్రభుత్వ కళాశాలకు దానం చేసి, కళాశాల నిర్మించడంవల్లే ఇది సాధ్యమైందని ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిపూడి ఎంపీపీ వాకా వెంకట రెడ్డి కొనియాడారు. ఉన్నతాధికారులతో చర్చించి ప్రహరీ నిర్మాణానికి తమవంతు కృషి చేస్తానన్నారు. కళాశాల ప్రహరీ నిర్మాణానికి ఎప్పుడైతే భూమి పూజ చేస్తారో అప్పుడే తన సొంత నిధులు వెచ్చించి కళాశాల ఎదరు ఆర్చీ ఏర్పాటుతో పాటు ప్రాంగణంలో మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకుంటానని అభివృద్ధి కమిటీ చైర్మన్, మాజీ సర్పంచ్ ఇనుకొల్లు పిచ్చిరెడ్డి సభా ముఖంగా హామీ ఇచ్చారు. అనంతరం ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన మెరిట్ విద్యార్థులకు ఎంవీ సుబ్బారావు ప్రశంస పత్రాలు, బహుమతులు అందజేశారు. ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, స్థల దాత ఇనుకొల్లు పిచ్చిరెడ్డి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఎంఈఓ ప్రసాద్ రెడ్డి, సర్పంచ్ కె. భాస్కర్, విశ్రాంత హెచ్ఎం బీఎల్ఎన్ శాస్త్రి, అధ్యాపకులు రంగయ్య , నాయక్, కరిముల్లా పాల్గొన్నారు.

పీఓఎస్ యంత్రాలు షురూ

- పంచాయతీల్లో నగదు చెల్లింపుల కోసం
- జిల్లా పంచాయతీ అధికారి నారాయణ రెడ్డి వెల్లడి


సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ నారాయణ రెడ్డి

ఒంగోలు సిటీ: పంచాయతీల్లో పాయింట్ ఆఫ్ సేల్ (పీఓఎస్) యంత్రాల ద్వారా నగదు రహిత చెల్లింపులను ఎంచుకోవచ్చని డీపీఓ నారాయణ రెడ్డి అన్నారు. శనివారం పాత జెడ్పీ కార్యాలయంలో పంచాయతీల్లో పీఓఎస్ మిషన్లు ఏర్పాటు, ఆన్‌లైన్ చేసే ప్రక్రియపై కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డీపీఓ నారాయణరెడ్డి మాట్లాడుతూ జిల్లాకు 156 గ్రామ పంచాయతీలకు గాను 204 పీఓఎస్ యంత్రాలు అందించారన్నారు. మూడు వేల జనాభాకు పైగల గ్రామ పంచాయతీ కార్యదర్శులకు టి.దివాకర్ ఎస్‌బీఐ స్టేట్ టెక్నికల్ ఇన్‌చార్జ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారన్నారు. గ్రామ పంచాయతీల్లో నగదు రహిత లావాదేవీలు నిర్వహించాలని, తద్వారా నిధులు దుర్వినియోగం కావన్నారు. ఇంటి పన్నులు, ఇతర పన్నులు నగదు రహిత లావాదేవీల రూపంలో వసూలు చేయాలని ఆదేశించారు. ఇప్పటికే 729 గ్రామ పంచాయతీల్లో క్యూఆర్ కోడ్‌ల ద్వారా నగదు రహిత లావాదేవీలు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో డీపీఓ పరిపాలనాధికారి శివప్రసాద్, డీపీఆర్సీ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ రమేష్, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

రఘునాయక స్వామి ఆలయంలో చోరీ

- సుమారు 10 కేజీల వెండి ఆభరణాలు మాయం
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు, క్లూస్ టీం


వేలిముద్రల ఆనవాళ్లు పరిశీలిస్తున్న క్లూస్ టీం

నాగులుప్పలపాడు: ప్రసిద్ధ చారిత్రాత్మక ఆలయం చదలవాడలోని రఘునాయక స్వామి ఆలయంలో దొంగలు వెండి ఆభరణాలు తస్కరించారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి జరిగినట్లు ఎస్సై ఉయ్యాల హరిబాబు తెలిపారు. స్థానికులు, పోలీసుల సమాచారం మేరకు.. శనివారం ఉదయం రఘునాయక స్వామి ఆలయం తలుపులు తీసి ఉన్నట్లు గమనించి స్థానికులు ఆలయ పూజారికి తెలిపారు. పూజారి వచ్చి చూడగా తలుపులు బద్దలు కొట్టి ఉండటంతో పాటు బీరువా తాళాలు తీసి ఉన్నట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అయితే దుండగులు ఆలయ ప్రాంగణంలోని సీసీ కెమెరాలను కూడా ధ్వంసం చేసి బీరువా తాళాలు తీశారు. దొంగతనం జరిగిందని నిర్ధారించుకొని క్లూస్ టీం సభ్యులు వేలిముద్రలు సేకరించారు.

రోడ్డును అడ్డుకున్న
టీడీపీ సానుభూతిపరులు


రోడ్డు వేసేందుకు డస్ట్‌ను చల్లించిన కాంట్రాక్టర్

యర్రగొండపాలెం: గ్రామీణ రోడ్ల అభివృద్ధిలో భాగంగా అస్తవ్యస్తంగా ఉన్న రోడ్డును వేస్తున్న సమయంలో టీడీపీ సానుభూతిపరులు అడ్డుకుంటున్నారు. అంతేకాకుండా పోలీసు కేసులు పెట్టి కాంట్రాక్టర్‌ను ఇబ్బంది పెడుతున్నారు. ఈ సంఘటన ఈ నెల 25వ తేదీన పుల్లలచెరువు మండలంలోని సిద్ధనపాలెం అంజనేయస్వామి వీధిలో జరిగింది. ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద రోడ్డు వేసేందుకు పంచాయతీరాజ్ శాఖ రూ.5 లక్షలు మంజూరు చేసింది. ఈ మేరకు కాంట్రాక్టర్ రోడ్డు పనులు ప్రారంభించాడు. డోజర్ పెట్టి రోడ్డును చదును చేస్తున్న సమయంలో ఆ ప్రాంతంలో ఉన్న టీడీపీ సానుభూతిపరులైన అంగన్‌వాడీ కార్యకర్త కుమారి, ఆమె తల్లి మంగమ్మ, ఇద్దరు తమ్ముళ్లు కోటయ్య, కోటేశ్వరరావు రోడ్డు వేయటానికి వీలులేదని అడ్డుకున్నారు. తమ ప్రభుత్వం త్వరలో వస్తుందని.. అప్పుడే తాము రోడ్డు వేసుకుంటామని అంగన్‌వాడీ కార్యకర్త రోడ్డు చదును చేస్తున్న డోజర్‌ను అడ్డుకుంది. అస్తవ్యస్తంగా ఉన్న రోడ్డు బాగుపడుతుంటే అడ్డుకోవడం ఏమిటని ఆ వీధికి చెందిన పలువురు మహిళలు ఆమెను పక్కకు తప్పించటానికి ప్రయత్నించారు. వారిపై కూడా అంగన్‌వాడీ కార్యకర్త దౌర్జన్యం చేసింది. ఆంజనేయస్వామి వీధిలో రోడ్డు వేయకుండా ఆమె అడ్డుకుంటుందని ఆ ప్రాంతం వాసులు ఆరోపించారు. తమ ఇంటిపై దాడి చేసి ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలు దోచుకొని వెళ్లారని, తనపై దౌర్జన్యానికి పాలుపడ్డారని ఆమె ఆరోపిస్తూ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి కేసుపెట్టింది. రోడ్డును అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించినందుకు తమపై దాడిచేసి చేతిని గాయపరిచారని ఆ వీధికి చెందిన ఇద్దరు మహిళలు ఎల్లమ్మ, వెంకటమ్మలు అంగన్‌వాడీ కార్యకర్త, ఆమె తల్లి, మరో ఇద్దరిపై కేసు పెట్టారు. రెండు కేసులను నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జాతీయ పోటీలకు దిరిశవంచ విద్యార్థిని

కనిగిరి రూరల్: జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు మండలంలోని దిరిశవంచ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని కె. ప్రసన్న ఎంపికైంది. గతేడాది నవంబర్‌లో గుంటూరులో జరిగిన ఎస్‌జీఎఫ్ఐ అండర్ – 14 బాలికల సాఫ్ట్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో కె. ప్రసన్న ప్రతిభ కనబర్చినట్లు పీడీ ఎస్. జ్యోతి బాబు తెలిపారు. విద్యార్థిని కె. ప్రసన్న ఫిబ్రవరి 3 నుంచి ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో పాల్గొననుంది. ప్రసన్నను పాఠశాల హెచ్ఎం వి. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు రమణయ్య, ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామ పెద్దలు అభినందించారు.

అదృశ్యమైన విద్యార్థిని శ్రీశైలంలో ప్రత్యక్షం

సీఎస్‌పురం (పామూరు): మండల కేంద్రమైన సీఎస్‌పురం కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో 7వ తరగతి చదువుతున్న అదేగ్రామానికి చెందిన విద్యార్థిని వల్లెపు అనూష అదృశ్యమైన ఘటన శుక్రవారం జరగ్గా శనివారం వెలుగులోకి వచ్చింది. అయితే అదృశ్యమైన విద్యార్థిని శ్రీశైలంలోని తల్లిదండ్రులు ఉంటున్న ఇంటికి శనివారం రాత్రికి చేరుకోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఎస్సై పి.అనిల్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. సీఎస్‌పురానికి చెందిన వల్లెపు శ్రీను, సరస్వతి కుమార్తె అనూష స్థానిక కేజీబీవీలో ఈ ఏడాది 7వ తరగతిలో చేరింది. కాగా పాఠశాలలో ఉండేందుకు ఇష్టంలేని విద్యార్థిని పలుసార్లు బయటకు వెళ్లినట్లు, అమ్మా నాన్నల దగ్గరకు వెళ్లిపోతానని తోటి విద్యార్థులతో చెప్పింది. కాగా తల్లిదండ్రులు శ్రీను, సరస్వతితోపాటు అన్న శ్రీశైలంలో కూలీ పనులు చేసుకుంటూ అక్కడే ఉంటున్నారు. మరో అన్న స్థానిక వడ్డెపాలెంలో ఉంటున్నాడు. ఈ క్రమంలో 26వ తేదీ సాయంత్రం 3 గంటల ప్రాంత్రంతో విద్యాలయం నుంచి విద్యార్థిని వెళ్లిపోయింది. విద్యార్థిని తల్లి సరస్వతి ఫిర్యాదు మేకు శనివారం అదృశ్యం కేసు నమోదు చేశారు. పామూరు సీఐ రామానాయక్ దర్యాప్తు చేపట్టారు. ఎస్సై అనిల్‌కుమార్, ఎంఈవోలు జె.ప్రసాదరావు, రాజాల కొండారెడ్డి కేజీబీవీని సందర్శించి ఎస్ఓ షేక్ రేష్మ, సిబ్బందితో మాట్లాడి విచారించి వివరాలు తెలుసుకున్నారు. అదేవిధంగా జీసీడీవో మాధవీ లత పాఠశాలలో విచారణ చేపట్టారు. విద్యార్థిని అనూష శ్రీశైలంలో తల్లిదండ్రులు ఉంటున్న ఇంటికి చేరినట్లు సమాచారం అందడంతో అంతా ఊపిరిపీల్చుకోగా ఉత్కంఠకు తెరపడింది. పాఠశాలలో విద్యార్థుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని జీసీడీవో మాధవీలత ఎస్వో రేష్మకు సూచించారు.

లక్ష్మీపురంలో పులి సంచారం

అర్ధవీడు(కంభం): అర్ధవీడు మండలంలోని లక్ష్మీపురం గ్రామ శివార్లలో పెద్దపులి సంచారం కలకలం రేపుతోంది. లక్ష్మీపురం సమీపంలోని అటవీ ప్రాంతంలో వారం రోజులుగా పశువుల మేతకు వెళ్లిన రైతులకు పెద్దపులి గాండ్రింపు శబ్దాలు వినబడుతున్నాయని అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో శనివారం వారు పులిజాడ కోసం అన్వేషించారు. పులి అడుగులు కనబడలేదని, అవసరమైతే ట్రాప్ కెమెరాలు అమర్చి పులిజాడలు గుర్తిస్తామని ఫారెస్టు అధికారులు చెబుతున్నారు.